క్లుప్తంగా

వంతెన పనులు త్వరగా పూర్తి చేయండి

కొత్తూరు: పట్టణ సమీపంలో వై జంక్షన్ కూడలి వద్ద జాతీయ రహదారిపై నిర్మిస్తున్న అండర్ పాస్ వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రమాదాల నివారణలో భాగంగా గత నాలుగేళ్ల క్రితం అండర్‌పాస్ పనులు ప్రారంభం కాగా నేటికి పూర్తి కాలేదన్నారు. దీంతో కూడలి వద్ద ప్రమాదాలు నిత్యకృత్యమైనట్లు పేర్కొన్నారు. పనులను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పర్యవేక్షించి వర్షాకాలంలోపు పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రేవంత్‌రెడ్డి పరామర్శ



మధుసూదన్‌రెడ్డితో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

షాబాద్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం మండలంలోని ఆస్పల్లిగూడలోని మధుసూదన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొని త్వరగా కోలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొడంగల్ ఇన్‌చార్జి జైపాల్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైకేల్‌రెడ్డి తదితరులున్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం వాసవీ క్లబ్ సభ్యులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని వినాయకగంజ్ ఆవరణలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు గార్లపాటి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిరుపేద కుటుంబానికి చెందిన ప్యాట శ్రీనివాస్ పిల్లల చదువులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వెంకటరమణ, శ్రీనివాస్, రాంమోహన్, కృష్ణయ్య, వేముల బాల్‌రాజ్, పెంటయ్య, శ్రీకాంత్, సురేష్, రాజు, మాణిక్యం పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్నస్వామి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

చేవెళ్ల: మండలంలోని గొల్లగూడలో ఆదివారం మల్లన్న స్వామి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంతా పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు బోనాల ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్తుంటే బోనాల ముందు పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతలు, డప్పుల చప్పులతో ఊరేగింపు సాగింది. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ రాంచంద్రయ్య, ఉప సర్పంచ్ విఠలయ్య, ఎంపీటీసీ మాధవి, మాజీ ఎంపీటీసీ జంగయ్య, మాజీ సర్పంచ్ హన్మంత్ రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి

మంత్రి సబితారెడ్డికి బీఆర్‌ఎస్ నేత వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అబ్దుల్లా

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని 3వ వార్డులో నిలిచిపోయిన ఎస్‌ఎన్‌డీపీ పనుల విషయమై స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు అబ్దుల్లా గాలిబ్ ఆదివారం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టిన ఎస్‌ఎన్‌డీపీ పనులు 500 మీటర్ల మేర పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కారణంగా గ్రీన్ సిటీ, డ్రీమ్ సిటీ, నబీల్ కాలనీల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి విన్నవించారు. రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలోని వార్డుల్లో కూడా త్వరలోనే పాదయాత్ర చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫైసల్ హుస్సేనీ, జహంగీర్ ఖాన్, మహ్మద్ తాహెర్ అలీ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తయ్యేదెన్నడో?

నత్తనడకన నిర్మాణ పనులు

- అధికారుల అలసత్వమే కారణం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



తీగలవాగు బ్రిడ్జి వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలోని పట్టణ కేంద్రం ప్రధాన చౌరస్తా నుంచి చేవెళ్ల వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారు. శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తా నుంచి పత్తేపురం వంతెన వరకు డబుల్ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరణ చేయడానికి ప్రభుత్వం రూ.3.06 కోట్లను మంజూరు చేసింది. పనులకు 10.06.2020 తేదీన మంత్రి సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శంకుస్థాపన జరిగి సుమారు మూడు సంవత్సరాలు కావస్తున్నా రోడ్డు పనులు మాత్రం ముందుకు సాగడం లేదని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రారంభం నుంచి పనులు నత్తనడక సాగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. పత్తేపురం తీగల వాగు వద్ద కేవలం బ్రిడ్జి పనులు చేపట్టి రోడ్డు పనులను గాలికి వదిలేశారని వాహనదారులు వాపోతున్నారు. పనులు సకాలంలో ముందుకు సాగకపోవడంతో ప్రయాణికులు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే భయపడుతున్నారు. కాగా, డిసెంబర్ 2020 కల్లా పూర్తి కావాల్సిన పనులు నేటికి పూర్తి కావడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగానే రోడ్డు పనుల్లో జాప్యం జరుగుతుందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి రోడ్డు పనులు వెంటనే పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శంకుస్థాపనకు వేసిన శిలాఫలకం

గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే సహకారంతో బంజారా భవన్ నిర్మాణానికి ఎకరా భూమి, రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆ సంఘం నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గిరిజనుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని చెప్పారు. గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేశారని వివరించారు. మారుమూల తండాలకు రవాణా వ్యవస్థలను కల్పించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌నాయక్, మిట్టునాయక్, రాంబల్ నాయక్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఎల్‌ఓసీ అందజేత

షాద్‌నగర్‌టౌన్: సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. నందిగామలోని చేగూరు గ్రామానికి చెందిన పబ్బె శివరాములు అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి నుంచి రూ.50వేలు ఎల్‌ఓసీని మంజూరు చేయించి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌నాయక్, విఠల్, శరత్‌కృష్ణ పాల్గొన్నారు.

చేగూరు గ్రామానికి ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ సంతోష

నందిగామ: బృహత్ పల్లె ప్రకృతి వనం నిర్వహణలో మండలంలోని చేగూరు భేష్ అనిపించుకుంది. రాష్ట్రంలోనే ఉత్తమ నిర్వహణ కల్గిన వనంగా నిలిచింది. దీంతో శనివారం రాత్రి హార్టీ కల్చర్ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డి, హార్టీ కల్చర్ రాష్ట్ర డైరెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా సర్పంచ్ మామిళ్ల సంతోష అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా సంతోష మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కృషితో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, గ్రామ కార్యదర్శి వీణా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీపైనే ప్రజలకు పూర్తి విశ్వాసం

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని దేవునిపల్లిలో పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఎంతో బలంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు చేపడుతున్న బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలతో ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. రాజకీయ భవిష్యత్తును ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని మోసం చేసి కొందరు నేతలు వెళ్లిపోతున్నారని వారిని భగవంతుడు క్షమించడని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చేగూరి ప్రసాద్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, అనంతయ్య, గోపాల్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా నర్సింలు, కోశాధికారిగా యాదయ్య, సభ్యులు నర్సింలు, రామస్వామి, సత్తయ్య, చెన్నయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, బాబర్‌ఖాన్, చెన్నయ్య, బాదేపల్లి సిద్దార్థ, రాజుగౌడ్, బసప్ప, తుపాలకు శేఖర్, అనంతం, పెంటయ్య, అస్మత్‌బాబా, లింగారం యాదయ్య, మల్లారెడ్డి, నాగిసాయిలు, శ్రీనివాస్, రాజు, శ్రీధర్, అశోక్, నవీన్, శేఖర్, రాజు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం

కొందుర్గు: కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రతో భాగంగా ఆదివారం మండలంలోని ముట్పూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు సామాన్యుల కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలనే పేరు మార్చి ఇస్తున్నారని, అందులో చాలా పథకాలను నీరుగార్చారని ఆరోపించారు. మహిళలకు పావలావడ్డీ రుణాలు, అభయాస్తం డబ్బులు నేటికి ఇవ్వడం లేదన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పూర్తిగా వదిలేశారని వాపోయారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని, పేదలకు పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు బాల్‌రాజ్ గౌడ్, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, సత్యంరెడ్డి, అంజిరెడ్డి, నర్సింలు, ద్విజేందర్, శ్రీను, అంజయ్య, శివ, రవీందర్ పాల్గొన్నారు.

కార్మికులకు డబుల్ ఇళ్లు కేటాయించండి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

శంకర్‌పల్లి: పారిశుద్ధ్య కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ కోరారు. ఆదివారం ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా కార్మికులు నిరంతరం కష్టపడుతున్నారని అన్నారు. చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరి చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ఇళ్లు లేక అద్దె ఇళ్లల్లో ఉంటున్నారని, వారికి శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని కోరారు. కాగా, సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే రూ. 3లక్షలు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు కృష్ణ, శాంతికుమార్, నర్సింలు, కోశాధికారి రాములు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దేవేందర్

నూతన నియామకం



మహేందర్‌గౌడ్

చేవెళ్ల: టీపీసీసీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా కందికొండ మహేందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. టీపీసీసీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్లను నియమిస్తూ టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ నవీన్, చేవెళ్ల నియోజకవర్గం కోఆర్డినేటర్ దినేష్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ నియామకంలో చేవెళ్ల మండల టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఎన్కేపల్లి గ్రామానికి చెందిన కందికొండ మహేందర్‌గౌడ్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర కమిటీకి, నియోజకవర్గ కమిటీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. సోషల్‌మీడియా ద్వారా పార్టీ సందేశాలను ప్రజలకు చేరవేస్తూ పార్టీని వ్యతిరేకించే పార్టీలకు తగిన సమాధానం చెబుతామన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్



మాట్లాడుతున్న రాజేష్‌పటేల్

కొందుర్గు: క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమేనని, ఓటమి గెలుపునకు నాందిగా భావించాలని వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ అన్నారు. మండలంలోని ఆగిర్యాలలో అంబేడ్కర్, పూలే జయంతిని పురస్కరించుకొని ఓపెన్ టూ ఆల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీలో కొందుర్గు జట్టు విన్నర్‌గా, బట్టుపల్లి జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా ఆదివారం టోర్నీ ముగింపు కార్యక్రమానికి రాజేష్‌పటేల్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం కల్గుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి టోర్నీలు నిర్వహించడం వల్ల యువకులలోని నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేశంగుప్తా, శ్రీనివాసు రెడ్డి, బీంసేన, రామకృష్ణ, కలాం, లింగంగౌడ్, గోవింద్, రమేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి

ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎంపీపీ ధర్మగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గోపులారం గ్రామానికి చెందిన బి.జైపాల్‌ను బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, గ్రామ బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడిగా బి.విష్ణు, ఉపాధ్యక్షుడిగా కే. శేఖర్, జనరల్ సెక్రటరీగా బి.లక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ పదవులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ఎస్సీసెల్ విభాగం అధ్యక్షుడు సామయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాఘవేందర్, కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీధర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



గోపులారం బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా బి.విష్ణు

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొత్తూరు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కల్గుతుందని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూడూరులో నూతనంగా నిర్మించిన కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఆదివారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాలతో సన్మానించారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ..ఆలయాలు ప్రజల పాలిట ప్రేమాలయాలుగా వెలుగొందుతున్నాయని అన్నారు. ఉరుకుల, పరుగుల జీవితంలో దైవభక్తితో ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. తనవంతుగా ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తయ్య, నాయకులు పద్మారావు, వెంకటేశ్, సురేష్, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాంచంద్రయ్య సేవలు చిరస్మరణీయం

కాంగ్రెస్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి

షాబాద్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బేగరి రాంచంద్రయ్య సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బేగరి రాంచంద్రయ్య విగ్రహ ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. గత రెండు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో రాంచంద్రయ్య మృతి చెందాడని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాంచంద్రయ్య మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీ చెన్నయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు మల్లేష్, సీనియర్ నాయకులు మహ్మద్ కుద్దూస్, జంగయ్య, గౌరీశ్వర్, శ్రీనివాస్ శేఖర్, శ్రీకాంత్, నర్సింహులు, మిట్టల్, మంగలి శేఖర్, తదితరులున్నారు.



విగ్రహావిష్కరణలో మధుసూదన్‌రెడ్డి, తదితరులు

అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



కౌన్సిలర్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

గోల్కొండ ఏరియా ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్

శంకర్‌పల్లి: మౌలిక వసతుల కల్పనలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ చంద్రమౌళి, మాజీ జెడ్పీటీసీ కళావతిని రాఘవేంద్ర కాలనీవాసులతో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. వారి సేవలను ప్రతి ఒక్కరు గుర్తిస్తే వారిలో మరింత ఉత్సాహం పెరుగుతుందన్నారు. కాగా, 9వ వార్డులో మౌలిక వసతులు కల్పించడంతో పాటు సీసీరోడ్లు, పోచమ్మ దేవాలయం నిర్మాణం చేయడం ఎంతో అభినందనీయమని కౌన్సిలర్ చంద్రమౌళిని అభినందించారు. కార్యక్రమంలో కాలనీవాసులు చంద్రశేఖర్, నందు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న శైలజ

ధ్యాన ప్రచారకర్తలు శైలజ, స్వప్న

షాబాద్: శ్వాస మీద ధ్యానం ప్రతి నిత్యం చేయాలని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచారకర్తలు గుండం శైలజ, స్వప్న పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నాగర్‌గూడ, తాళ్లపల్లి తిమ్మారెడ్డిగూడ, ఏట్లఎర్రవల్లి, వెంకమ్మగూడ గ్రామాల ప్రజలకు ధ్యానం వల్ల పొందే లాభాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధ్యానంతో తలనొప్పి నుంచి క్యాన్సర్ లాంటి ప్రమాదకర జబ్బులు కూడా నయం అవుతాయని చెప్పారు. నిత్యజీవితంలో ఎదుర్కొనే ఒత్తిడిల నుంచి బయటపడవచ్చొన్నారు. ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. నిత్యజీవితంలో ధ్యానం చేయడం ఒక దినచర్యగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బంగ్లా ఆంజనేయారెడ్డి, బాలకృష్ణారెడ్డి, నవీన్, శ్రీనివాస్, వెంకటలక్ష్మి, రాధ, సుభద్ర, శ్రీనివాస్, యాదయ్య, రామ్మోహన్, రవినాయక్ ఉన్నారు.